
ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
శనివారం
23 నవంబర్ 2024


# ఘనంగా విజయోత్సవాలు


ఆదిలాబాద్‌జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అధికారులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి కళాకారుల బృందం అంతడుపుల నాగరాజు ఆద్వర్యం లో కళాకారుల ప్రదర్శనలు ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ట్రైనీ కలెక్టర్ అభీగ్యాన్ మాలవీయ, ఆర్డీవో వినోద్ కుమార్, సీఈఓ జితేందర్, డీవైఎస్వో వెంకటేశ్వర్లు, డీపీఆర్వో తిరుమల, టూరిజం ఆఫీసర్ రవికుమార్, ప్రజాప్రతినిధులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

- ఉద్యమ కెరటం, ఆదిలాబాద్



## బాధిత కుటుంబాలకు ఆర్ఎస్పీ పరామర్శ

**ఉద్యమ కెరటం, బెజ్జూర్ :** మండల కేంద్రానికి చెందిన జహీర్ హుస్సేన్, మొహమ్మద్ మోవీస్, మొహమ్మద్ ఇర్షాద్ ఇటీవలే ప్రాణహిత నదిలో గల్లంతై మృతి చెందగా, బాధిత కుటుంబాలను శుక్రవారం బీఆర్ఎస్‌రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ నడుగురే శ్యామ్ రావు, యూత్ కన్వీనర్ కాశి పాక రాజు, నాయకులు ఆవుల శ్రీనివాస్ యాదవ్, భూసా రయ్య యాదవ్, నక్క మనోహర్, కొండ రాంప్రసాద్, మొహమ్మద్ సలీం, మండల నాయకులు కాజా మొయినుద్దీన్, యూత్ అధ్యక్షులు దుర్గం తిరుపతి, మైనారిటీ అధ్యక్షులు యాకూబ్, కాజా శంషుద్దీన్ (బాబు), నికాడి మోహన్రావు, గుమ్ముల రాకేష్, డబ్బా తిరుపతి, రౌతు బాపురావు తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్ పెంచాలని దివ్యాంగుల నిరసనలు

**ఉద్యమ కెరటం, మందమర్రి:** ఎన్నికల హామీ మేరకు ఆసరా పెన్షన్లు పెంచకపోవడాన్ని నిరసిస్తూ మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి సంఘం నాయకులు, వికలాంగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు 6000 పెన్షన్ ఇస్తామని ప్రకటించి విస్మరించిందన్నారు. వెంటనే పెన్షన్ పెంచని పక్షాన ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇండ్లలో 5% శాతం రిజర్వేషన్ కల్పించాలని రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో వారికి అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎస్ నాయకులు బూర్ల మహేందర్, మేడ పట్ల సతీష్, ఇందూరి రమేష్, ప్రకాష్ యాదవ్,నరేష్, శ్రీనివాస్, లింగమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయాలకు నిధులు మంజూరు చేయాలి

కాంగ్రెస్‌బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయాలకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని, టెండర్ దశలో ఉన్న బోథ్ పట్టణ కేంద్రంలోగల భక్త శివమార్కండేయ ఆలయానికి టెండర్లు పిలవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కోరారు. శుక్రవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ అన్ని దేవాలయాలకు కావలసిన నిధులు మంజూరు చేస్తామని, నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేయించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలగజేయడానికి కృషి చేస్తానని అయన పేర్కొన్నారు,గిరిజన ఆదివాసి గూడాలలో వారి సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా దేవాలయాల నిర్మాణానికి కృషి చేయాలని, బోథ్ పట్టణంలోని శివ మార్కండేయ ఆలయానికి అవసరమగు నిధులు మంజూరు చేయించడంతో పాటు, ప్రారంభోత్సవానికి రావాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్, మాజీ కేంద్ర మంత్రివర్యులు సముద్రాల వేణుగోపాల చారి, ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కోమురం కోటేశ్వర్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెరుగు భోజన్న , మాజీ ఎంపీపీ మల్లేష్ పాల్గొన్నారు.

## ఎస్సై సేవలు మరువలేనివి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** బెజ్జూర్ మండల కేంద్రంలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన బిక్రం సేవలు మరువలేనివని గ్రామస్తులు కొనియాడారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న ఎస్సైకి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సై ప్రజలతో మమేకమై, సామాజిక సేవలు చేశారని పేర్కొన్నారు. మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంఘ వ్యతిరేక కార్యక్రమాలు ప్రబలకుండా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉన్నారని చెప్పారు. అనంతరం ఆయనను సన్మానించి, వీడ్కోలు పలికారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సైని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమైక్య మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, గ్రామ పెద్దలు రహెమత్, పురుషోత్తం, దేవాజీ, నారాయణ, శ్రీనివాస్, దసురు, శ్రీనివాస్, గణపతి, పోశయ్య, షేక్ పటేల్, శ్రీనివాస్, రామయ్య, అసలం, సోమయ్య, శ్రీనివాస్, ఆరిఫ్, నిసార్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి శిక్షణను వినియోగించుకోవాలి




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్విన్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్యం కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు 3 నెలల పాటు ఇస్తున్న ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇదివరకు మూడు నెలల పాటు శిక్షణ పొందిన అభ్యర్థులకు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ,శిక్షణా కేంద్రంలో టైలరింగ్, కంప్యూటర్, సీసీ కెమెరాలు, మొబైల్ రిపేరింగ్, కంప్యూటర్ శిక్షణ, రిఫ్రిజరేటర్, ఎయిర్ కండిషన్ లలో 3 నెలల కాల పరిమితులలో శుధిక్షుతులైన అభ్యర్థుల ద్వార శిక్షణా ఇవ్వడం జరుగుతుందని, తెలిపారు. నిరుపేద యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు ఐటిడిఎ, ఉమెన్ వెల్ఫేర్, స్పాన్సర్డ్ చేయబడిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని,ఈ శిక్షణలో ఉత్తీర్ణులైన వాటికి సర్టిఫికెట్ అందజేసి,చదువుతో పాటు అదనంగా ఒక్కొక్క రంగం లో స్కిల్ నైపుణ్యత పొంది ఉపాధి అవకాశాలు పొందాలని అన్నారు. ఈ మూడు నెలల శిక్షణా లో 120 మంది యువత శిక్షణా పొందారని అన్నారు. ఈ సందర్భంగా శిక్షణా పొందిన వారిని పరిచయం చేసుకొని నేర్చుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. టైలరింగ్ నేర్చుకున్న సిబ్బంది డ్వాక్రా గ్రూపు లో సభ్యులుగా చేరాలని ఆనారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఒ వెంకటేశ్వర్లు, డిడబ్ల్యూఒ సబిత, ఫ్యాకల్టీ, సిబ్బంది, ప్రిన్సిపాల్ రవీందర్, వైటీసీ ఇంఛార్జి, బల్ రాం, లలిత, సాగర్, విశాల్, సునీల్, తదితరులు ఉన్నారు.

## జిల్లా గెజిటెడ్ అధికారుల కమిటీ ఎన్నిక

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లా గజిటెడ్ అధికారుల జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కమిటీ ఎన్నికలలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సెంట్రల్ అసోసియేషన్-హైదరాబాద్ సంయుక్త కార్యదర్శి ఎ. పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులుగా డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షులుగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. ఎం. విజయ్, ఉపాధ్యక్షులుగా నాయక్ తహసిల్దార్ జాదవ్ జితేందర్, కౌటాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోట ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్-మహిళ గా ఖజానా శాఖ ఉప అధికారి జి. భానుమతి, కార్యదర్శిగా నాయబ్ తహసిల్దార్ ఎస్. పోచయ్య తో పాటు మొత్తం 15 మందితో కూడిన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.





## కవ్వాల్ ఫారెస్ట్ జోన్‌లోని గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఉద్యమ కెరటం, ఉట్నూర్ :** కవ్వాల్ ఫారెస్ట్ జోన్ లోని గ్రామాల సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలోని అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో టైగర్ రిజర్వు గవర్నింగ్ బాడీస్ మీటింగ్ రాష్ట్ర, అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ లోని ఫారెస్ట్ లో వాహన రాకపోకలను కొంతమేరా అనుమతి ఇవ్వాలని కోరారు. కడెం మండలంలోని అల్లంపల్లి, సిరికొండ మండలం వాయిపేట, పెంబి మండలంలోని అంకెనా, ఇస్లాంపురా, దొంధరి గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉట్నూర్ మండలం ధర్మాజీపేట,కడెం మండలం మిద్దెచింత, పెంబి మండలంలోని చాకిరేవు, బుర్కారేగాడి గ్రామాలలో కరెంటు సమస్యలున్నాయని అటవీ శాఖ అనుమతి దొరికితే సమస్యలు తిరుతాయన్నారు. లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను సైతం పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే మంత్రిని కోరారు.

## తహసీల్దార్ కు సన్మానం



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** తిర్యాణి మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ సూర్యప్రకాష్ కు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లెర్ల విగ్నేశ్వర్ తోపాటు మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బెజ్జూర్ ఎస్సైగా ప్రవీణ్



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** బెజ్జూరు ఎస్సైగా ప్రవీణ్‌శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. లింగాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా పని చేసిన ప్రవీణ్ ఈ నెల 18న బెజ్జూర్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గుడుంబా, గంజాయి, పేకాట, కోడిపందాల నిర్వహణ వంటి సంఘ వ్యతిరేక చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు నాయకులు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలుంటే నేరుగా తనకు సంప్రదించవచ్చని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలోని అచలాపూర్, రేచిని, తాండూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ పరిశీలించారు. కేంద్రం వద్ద కొంతమంది రైతులు పంటను ఎండబెట్టడాన్ని చూసి, వారికి పలు సూచనలు చేశారు. పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే, మద్దతు ధర క్వింటాలు ఏ గ్రేడ్ వరికి 2320 రూపాయలతో పాటు 500 రూపాయల బోనస్ వస్తుందన్నారు. అలాగే బీ గ్రేడ్ ధాన్యానికి క్వింటలు రూ.2300 ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల వ్యవసాయాధికారి కే సుష్మ, తాండూర్ గిర్దావర్2 ఇజాజోద్దీన్, ఏఈఓ శంకర్, సహకార సంఘం కార్యాలయ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది అనిల్,వెంకటేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవాలు విజయవంతం చేయాలి

### కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ



**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు,వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన – ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని ఆపార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ ఒక ప్రకటనలో కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన గార్యంటీ పథకాలైన మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి, చేయూత పెన్షన్, రైతు రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగ నియమకాలపై పార్టీ శ్రేణులు గ్రామ గ్రామానికి వెళ్లి ఉద్యోగులు, ప్రజా ప్రతి నిధులు, మహిళాసంఘాల సభ్యులతో కలిసి ప్రజాపాలన విజియోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.

## యోగా కేంద్రం ప్రారంభం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలోని ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా మంజూరైన యోగా కేంద్రాన్ని శుక్రవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌అచ్యుత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుర్వేదిక్ సెంటర్ ఫార్మాసిస్టు వొల్లాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు మహిళల కోసం యోగ శిక్షకులు బొజ్జ కళావతి యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పురుషులకు యోగా శిక్షణ యోగా శిక్షకులు జనగామ లక్ష్మణ్ యోగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలనుకునేవారు సమయపాలనతో హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.





## టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశానికి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** హైదరాబాద్ లోని గాంధీభవన్ లో శుక్రవారం నిర్వహించిన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలు,రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా చేపట్టిన కులగణన ,రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలు, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన %–% ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రామ గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభి వృద్ధిపనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.





## మంచినీళ్లు కలుషితం

**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ టౌన్ :** కాగజ్‌నగర్‌మున్సిపల్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలాగటం ఆడుతున్నారు. మంచినీరు కలుషితమవుతున్నా పట్టించుకోవడం లేదు. కాగజ్ నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియా కాకతీయ హొటల్ ప్రధాన రోడ్డు సమీపంలో కొన్ని నెలలుగా మురికికాల్వ శుభ్రం చేయకపోవడంతో చెత్తా, చెదారంతో నీరు నిలిచిపోయింది. అదే మురికికాల్వలో ప్రధాన మంచినీటి పైప్‌లైన్ ఉంది. అది కూడా లీక్‌కావడంతో మురికినీరంతా కలుషితమవుతున్నది. ఈ విషయాన్ని మున్సిపల్‌అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడుతున్నారు. ప్రజలు రోగాల బారిన పడితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజలకు హానిక జరగక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- ప్రధాన మురికి కాల్వలో పైప్‌లైన్‌లీకేజీ
- మురికికాల్వ శుభ్రం చేయని వైనం
- ప్రజల ప్రాణాలతో మున్సిపల్‌చెలగాటం
- పట్టించుకోని అధికారగణం



## గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ఉద్యమ కెరటం, నిర్మల్ :** గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమ అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలను సరిపడినన్ని అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయంలో కుర్చీల కొరత రాకుండా చూడాలన్నారు. అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతూ వారికి గల అవసరాలను అడిగి తెలుసుకున్నారు సమయపాలనను పాటిస్తూ శ్రద్ధగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రంథాలయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలి, తాహసిల్దార్ రాజు, అధికారులు మోహన్ సింగ్ , విజయ శ్రీ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాల తనిఖీ

**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ టౌన్ :** కాగజ్‌నగర్ మండలం చిన్న రాస్పల్లి గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు, వంటశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి పౌష్టికహారం అందించాలని, వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

## ఈపీ ఆపరేటర్లను ఆదరించి, ఆర్థిక నష్టాన్ని పూరించాలి

### సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మంద నరసింహారావు



**ఉద్యమ కెరటం, మందమర్రి:** సింగరేణి సంస్థ స్థాపించినప్పటి నుంచి ఉత్పత్తిలో ప్రత్యక్ష పాత్ర పోషిస్తూ ఉన్న ఈపీ ఆపరేటర్లను ఆర్థికంగా నష్టపోకుండా చిన్నచూపునకు గురి కాకుండా వారిని యాజమాన్యం ఆదరించాలని శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మంద నరసింహారావు ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషించే ఈపీ ఆపరేటర్స్ నాడు కోల్ ఫిల్లర్స్ గా నేడు ఈపీ ఆపరేటర్లుగా సింగరేణి సంస్థను కాపాడుతున్నారని, ఆపరేటర్ గా ట్రైనింగ్ ఉన్నప్పటికిని బేసిక్ ఏ మిషన్ నడుపుతున్నారని, ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్ ఇచ్చి వారిని ఆదరించాలని ఆయన కోరారు. సరైన సమయానికి వారికి ప్రమోషన్లు ఇవ్వక పోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని యాజమాన్యం వైఖరి మార్చుకోనట్లేదే భవిష్యత్తులో సింగోణి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గుర్తింపు సంఘాలు మాత్రం ఉచిత మాస్టర్లతో కాలయాపన చేస్తూ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా వారిపై కార్మికుల్లో ఉన్న నమ్మకాన్ని కోల్పోతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా గుర్తింపు సంఘాలు కార్మికుల సమస్యల పట్ల దృష్టి సారించి వారి హక్కును కల్పించే దిశలో పోరాడాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో వంద శాతం ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వైద్య, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులతో పలు అంశాలపైసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. గర్భిణీలను ప్రయివేట్ ఆసుపత్రులకు పంపించకుండా స్థానిక ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆశ, ఏఎన్ఎంలు అంగన్వాడి టిచర్లు ఇంటింటికి వెళ్లి గర్భినిస్త్రీలను రిజిస్ట్రేషన్ చేయించి వారికి పౌష్టికాహారం అందించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌లను పిహెచ్‌సిల వారిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

